క్లుప్తంగా

నేడు సచివాలయాల ప్రారంభోత్సవాలు

రామచంద్రపురం: రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నేటి ఉదయం 10 గంటలకు రామచంద్రపురం మండలం వేగాయమ్మపేటలో గ్రామ సచివాలయ భవన ప్రారంభోత్సవంలో, 11 గంటలకు కె.గంగవరం మండలం పాణింగపల్లిలో గ్రామ సచివాలయం, పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లోనూ పాల్గొంటారని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏరియా ఆసుపత్రిలో పండ్ల పంపిణీ



రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేస్తున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాశ్ పుట్టినరోజు పురస్కరించుకుని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో అభిమానులతో కలసి కేక్ కట్ చేశారు. రామచంద్రపురం పాత బస్టాండ్ వద్ద అన్నదానం నిర్వహించారు.

ఏడిద హైస్కూల్లో వన మహోత్సవం



పాఠశాలలో మొక్క నాటుతున్న సర్పంచ్ ఆశీర్వాదం, నాగబాబు, సుధాకర్ తదితరులు

మండపేట: ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆ పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. పాఠశాల ఆవరణంలో సుమారు 200లకు పైగా పూలు, నీడ నిచ్చే మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు సభ్యుడు పలివెల సుధాకర్ తదితరులతో కలిసి సర్పంచ్ ఆశీర్వాదం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తమరావు పాఠశాల అభివృద్ధికి ఎనలేని తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఆయన సహకారంతో పాఠశాలలో సుమారు రూ. రెండు కోట్ల వ్యయంతో అదనపు భవనాలు నిర్మించామన్నారు. విద్యార్థులకు చక్కటి వాతావరణం కల్పించే నిమిత్తం పలు రకాల మొక్కలను నాటుతున్నట్టు వారు వివరించారు.

రాజమహేంద్రవరం బస్సును పునరుద్ధరించాలి

కాజులూరు: రాజమహేంద్రవరం డిపో నుంచి మండలంలోని మంజేరుకు వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సును అధికారులు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. శుక్రవారం కాజులూరులో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ రాజమహేంద్రవరం నుంచి రామచంద్రపురం, ద్రాక్షారామ మండలంలోని కుయ్యేరు, దుగ్గుదుర్రు, కాజులూరు, చేదువాడల మీదుగా ప్రతి రోజూ ఒక బస్సు నాలుగు పర్యాయాలు మంజేరు వచ్చి వెళ్లేదన్నారు. కరోనా లాక్‌డౌన్ కారణంగా బస్సును నిలుపుదల చేసిన అధికారులు కొన్ని రోజులు పునః ప్రారంభించినప్పటికీ మరలా నిలిపివేశారన్నారు. మండల గ్రామాల నుంచి ప్రతిరోజూ అధిక సంఖ్యలో ప్రజలు రామచంద్రపురం, రాజమహేంద్రవరం తదితర పట్టణాలకు వెళుతుంటారని అధికారులు స్పందించి బస్సురూటును పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలన్నారు. మంజేరు పీఏసీఎస్ అధ్యక్షుడు గండి కిశోర్, చేదువాడ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ చైర్మన్ గంజా సూరిబాబు, కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి తదితరులు బస్సు కోసం డిమాండ్ చేసిన వారిలో ఉన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు తీసుకోవాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. డ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు.

వరాల తల్లీ పాహిమాం..



ద్రాక్షారామలో కోటిపల్లి రోడ్డులోని దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద బారులు తీరిన మహిళలు



ద్రాక్షారామ మాణిక్యాంబ సన్నిధిలో లలితా సహస్రనామ పారాయణ చేస్తున్న మహిళలు



ప్రత్యేకాలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు
- ఆలయాలకు బారులు తీరిన భక్తులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు ఆలయాల వద్ద అమ్మవారి దర్శనానికి మహిళలు బారులు తీరారు. ద్రాక్షారామలోని భీమేశ్వరాలయంలో కొలువైన మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు తరలివచ్చారు. క్యూలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు గావించారు. వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సతీమణి వరలక్ష్మి, ద్రాక్షారామ, పరిసర గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారి సన్నిధిలో లలితా సహస్రనామ పారాయణ చేశారు. నరసాపురపుపేట, ఓదూరు, ఉండూరు, చోడవరం, వెంకటాయపాలెం, తాళ్లపొలం తదితర గ్రామాలల్లో దుర్గమ్మ అమ్మవార్ల ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. ద్రాక్షారామలోని కోటిపల్లి రోడ్డులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద దర్శనానికి మహిళలు పెద్ద ఎత్తున బారులు తీరారు. రాత్రి వరకు అమ్మవారి దర్శనానికి మహిళా భక్తులు వేచి ఉన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: నియోజకవర్గంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం, వరలక్ష్మి వ్రతం కావటంతో పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఇంటివద్ద వ్రతమాచరించిన మహిళలు సాయంత్రం వేళల్లో ఆలయాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని శివాలయం వీధిలోని కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయం, కొత్తూరు రోడ్డులోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు విశేష కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కోదండరామాలయంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారిలోని జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరిచుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు కుంకుమ పూజలు చేసి వ్రతాలను ఆచరించారు. ఆలయ అర్చకులు మహిళలతో ప్రత్యేక పూజలు చేయించారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో శుక్రవారం మహిళలు వరలక్ష్మీ అమ్మవారి వ్రతాలను ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణమాసంలో వచ్చే నాలుగు శుక్రవారాలను మహిళలు పుణ్యదినాలుగా భావిస్తారు. ప్రధానంగా శ్రావణపౌర్ణమి ముందుగా వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ప్రత్యేకంగా ఆచరిస్తారు. ఈ క్రమంలో శుక్రవారం మహిళలు అధిక సంఖ్యలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి ఆలయాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని 26 గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లోను ప్రత్యేక పూజలు జరిగాయి.

సిరుల తల్లికి ప్రణమిల్లి..

రాయవరం: 'లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం.. శ్రీరంగ ధామేశ్వరీం..దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం' అంటూ మహిళా లోకం సిరుల తల్లికి ప్రణమిల్లింది. మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించారు. పలువురు మహిళలు అష్టోత్తర శత నామాలతో వరలక్ష్మీదేవిని పూజించి షడ్రసోపేతమైన మహా నైవేద్యాన్ని నివేదించారు. ముత్తైదువులకు వాయనాలు, తాంబూలాలు ఇచ్చారు. మహిళలు సాయంత్రం వ్రత మాచరించాక, దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. పలు దేవాలయాలు ముఖ్యంగా దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయాలను అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పలు ఆలయాలు కళకళలాడాయి.



సోమేశ్వరంలో విశేషాలంకరణలో శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి

సకల శుభాలకు మూలం..

శ్రావణ మాసం సకల శుభాలకు కారణమని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. శుక్రవారం పీఠంలో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సామూహిక శ్రావణ వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి గాడ్ మాట్లాడుతూ శ్రావణమాసంలో అష్టలక్ష్మీల రూపమైన వరలక్ష్మిని పూజించడంతో సకల సంపదలు కలుగుతాయన్నారు. పీఠంలో విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠంలో వెండితో చేసిన అష్ట లక్ష్మీ కలశాన్ని ఏర్పాటు చేసి పురోహితులు మహిళలతో గౌరీపూజ, వరలక్ష్మీ అమ్మవారికి అష్టోత్తర సహస్ర నామాలతో కుంకుమ, పుష్పాలతో పూజలు చేశారు. పీఠానికి హాజరైన భక్తులకు పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి) ఆధ్వర్యంలో ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు.

కిటకిటలాడిన పెద్దమ్మ తల్లి ఆలయం

మండపేట: శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తమ ఇంట సిరి సంపదలు, సుఖ సంతోషాలు కలగజేయాలని వేడుకుంటూ అమ్మవారికి పూజలు చేశారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఏడిద రోడ్డులోని పెద్దమ్మ తల్లి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి మండపేట, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, కౌన్సిలర్లు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వాలిన వీరబాబు ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్ బాబా, ఆలయ కమిటీ సభ్యులు మండిపూడి చంద్రశేఖర్, కె. శ్రీను, పోతకుల రాజేశ్వరి, లలిత, చల్ల శివరాం తదితరులు పాల్గొన్నారు.



మండపేట పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల పూజలు

పట్టణంలోని బురగుంట చెరువు వద్ద గల శ్రీరామ క్షేత్రంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, రథం గుడి, కొండపల్లి వారి వీధిలోని దుర్గమ్మ ఆలయం, కలువపువ్వు సెంటర్‌లోని అమ్మవారి ఆలయం, గొల్లపుంత కాలనీలోని సత్తెమ్మ తల్లి ఆలయం, సత్యశ్రీ రోడ్డులోని అమ్మవారి ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. మండలంలోని కేశవరం, ద్వారపూడి, ఏడిద, మారేడుబాక, వెలగతోడు, అర్తమూరు తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఏడిద రోడ్డులోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద మహిళలు పూజలు చేశారు.

అర్హతే ఆధారంగా సంక్షేమం

- రాజకీయాలకతీతంగా సీఎం జగన్ పాలన
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- నాగులచెరువులో గడప గడపకూ..



నాగులచెరువు గ్రామస్తుల సమస్యలను వింటున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: కులమతాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ఆధారంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని నాగుల చెరువులో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్సీ తోటకు పూలమాలలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి పూర్తి తోడ్పాటు అందిస్తున్న ఎమ్మెల్సీ తోటకు జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సొసైటీ చైర్మన్ మేడిశెట్టి గోవింద్ కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, సచివాలయ ఉద్యోగులు గ్రామంలో అభివృద్ధి పనుల వివరాలను ఎమ్మెల్సీ తోటకు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ప్రతి పేదవాడి ఇంటికీ ప్రభుత్వ లబ్ధి అందించాలని, అందులో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ తోట భరోసా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లోనే అమలవుతున్నాయన్నారు. పేదలపై ప్రేమతో ఆర్థిక ఇబ్బందులను సైతం అధిగమించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇంతకు ముందు ప్రజలకు మంచి చేయలేని విపక్షాల నేతలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయని వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట తనయుడు తోట పృథ్వీరాజ్, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి త్రిమూర్తులు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాపేశ్వరం రోడ్డు పనులు పునఃప్రారంభం



మొదలైన తాపేశ్వరం రోడ్డు పనులు

మండపేట: తాపేశ్వరం రోడ్డు పనులు శుక్రవారం పునః ప్రారంభమయ్యాయి. సాంకేతిక కారణాలు, నిధుల విడుదలలో జాప్యం వల్ల ఏడు నెలలుగా ఈ రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయిన విషయం విదితమే. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఉన్నతాధికారులతో మాట్లాడి బిల్లుల విడుదల చేయించి పనులు ముందుకు సాగేందుకు ఉన్న అవరోధాలను తొలగించారు. గురువారం రోడ్డు పనులు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్ బీ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ అధికారులు పనులు మొదలు పెట్టడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పనపాడు వద్ద రెండో వైపు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తిరుశూల శ్రీనివాసు, స్థానిక నాయకులు పనులను పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు కృషిచేస్తున్నామని ఆర్‌అండ్‌బీ జేఈ సూర్యనారాయణ తెలిపారు.

తడి–పొడి వ్యవసాయంపై రైతులకు అవగాహన



యనమదలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త నరసింహారెడ్డి

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదలలో హైదరాబాద్‌కు చెందిన కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు తడి–పొడి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త నరసింహారెడ్డి నీటి అవసరం ఎక్కువగా ఉన్న వరి పంటలో నీటి అవసరం తగ్గించుకునే వీలుతో పాటు వరి పంట నుంచి విడుదలయ్యే విష వాయువు మీథేన్ ఉత్పత్తిని తగ్గించే అవకాశం ఉన్న తడి–పొడి వ్యవసాయ విధానంపై వివరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు చెల్లుబోయిన నరేన్ మాట్లాడుతూ నీటి అవసరం 20 శాతం వరకు తగ్గించుకునే వెసులుబాటు ఉన్న ఈ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్, సర్పంచ్ పంపన వీరవెంకటరమణ, ఎంపీటీసీ నురుకుర్తి శ్రీరామకృష్ణ, మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ మల్లెల కొండారెడ్డి, కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్ సంస్థ రామచంద్రపురం మండల కోఆర్డినేటర్ తుట్టా సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

శిథిల భవనాన్ని తొలగించాలి



మొగలిపాలెంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

కాజులూరు: బందనపూడి శివారు మొగలిపాలెంలో శిథిలావస్థలో ఉన్న మండల పరిషత్ పాఠశాల భవనాన్ని తొలగించి దాని స్థానంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో సుమారు 40 సంవత్సరాల క్రితం అప్పటి తాళ్లరేవు సమితి అధ్యక్షుడు పబ్బినీడి సత్యనారాయణ ఆధ్వర్యంలో భవన నిర్మాణం చేపట్టి ప్రారంభోత్సవం చేశారు. క్రమేపీ భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో పది సంత్సరాల క్రితం పక్కనే జిల్లా పరిషత్ నిధులతో మరో భవనం నిర్మించి పాఠశాలను అందులోకి మార్పు చేశారు. పాతభవనం గోడలు పగుళ్లు తీసి శ్లాబు పైభాగం పెచ్చులూడిపడుతుండటంతో ఇది ఏ క్షణాన కూలిపోతుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వివిధ కులాలకు చెందిన 600 మంది జనాభా ఉన్నారు. ఏ శుభకార్యం వచ్చినా సమావేశం జరిగినా భవన సదుపాయం లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని పాలకులు స్పందించి శిథిల పాఠశాలను తొలగించి దాని స్థానంలో కమ్యూనిటీ హాలును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

చెల్లూరులో రామాలయానికి భూమిపూజ



చెల్లూరులో రామాలయ భూమిపూజలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్

రాయవరం: మండలంలోని చెల్లూరులో శుక్రవారం రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆ గ్రామంలోని శెట్టిబలిజ రామాలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. అందులో భాగంగా కొప్పిశెట్టి శ్రీనివాస్ దంపతులు పీఠలపై కూర్చుని భూమిపూజ చేశారు. ప్రభుత్వ నిధులు, గ్రామస్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు శెట్టిబలిజ సంఘం పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్, జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ, పారిశ్రామికవేత్త చైతన్య రాజబాబు, ఉప సర్పంచ్ బుద్దాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు వైట్ల వీరవేణి, సొసైటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, దేవస్థానం చైర్మన్ రిమ్మలపూడి రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చోడె వెంకటరమణ పాల్గొన్నారు.

బాలబాలికల హక్కులపై అవగాహన



ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్

రామచంద్రపురం: పట్టణంలోని సెయింట్ ఎన్‌గ్లోరియా హైస్కూల్‌లో ఎయిమ్స్ హ్యూమన్ రైట్స్ సొసైటీ సర్వేస్ సంస్థ ఆధ్వర్యంలో బాల, బాలికల హక్కులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమం, ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమాలను శుక్రవారం ఏర్పాటు చేశారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ రిబ్బన్ కత్తిరించి ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ చిన్నారులకు చట్టం రక్షణగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఏ విధంగా ఎదుర్కోవాలనేది వివరించారు. 200లకు పైగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఎంఈఓ వాసంశెట్టి నాగేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీకాంత్, ఉప ప్రధానోపాధ్యాయుడు టి.చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలతో రైతులకు మెరుగైన సేవలు

రాజోలు: ఆర్బీకేల ద్వారా వ్యవసాయశాఖ రైతులకు మెరుగైన సేవలు అందిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలపల్లి, శివకోటి గ్రామాల్లోని ఆర్బీకేలను ఆయన పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల కోసం అందుబాటులో ఉంచిన ఎరువుల గొడౌన్లలో నిల్వలను తనిఖీ చేశారు. ఈ–క్రాప్ నమోదు లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చింతలపల్లి, శివకోటి గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులతో వరి సాగులో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంటబీమా, గిట్టుబాటు ధర, ఎరువులు, పురుగుమందులు, వైఎస్సార్ యంత్రసేవా పథకాలపై అవగాహన కల్పించారు. ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఏఓ వై.మధుకుమార్, వీఏఏలు చంద్రశేఖర్, వర్మ, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బడి ప్రాధాన్యాన్ని వివరిస్తున్న ఉద్యోగులు

కపిలేశ్వరపురం: మెరుగైన జీవన ప్రమాణాలను ప్రసాదించే బడి ప్రాధాన్యతను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చిన్నారులు, వారి తల్లిదండ్రులకు తెలియజెప్పుతున్నారు. మండలంలోని వల్లూరులో శుక్రవారం బడికి అడపా తడపా వెళ్తున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి చదువు ప్రాధాన్యతను వివరించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సీహెచ్ నాగేంద్ర, మహిళా పోలీస్, గెద్దం ప్రమీల, వలంటీర్ వి.సూరిబాబులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ విద్యాలయాలను మెరుగు పర్చిందని, పలు సామాజిక కారణాల రీత్యా కొంతమంది చిన్నారులు బడికి వెళ్లడంలో అలసత్వం చూపుతున్నారన్నారు. వారికోసం ఉన్నతాధికారుల ఆదేశాలపై చదువు, బడి ప్రాధాన్యతలను వివరించి బడికి పంపేందుకు కృషి చేస్తున్నామని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చెప్పారు.

28 వేల ఎకరాల్లో ఈ–పంట నమోదు పూర్తి

పి.గన్నవరం: ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో ఇప్పటికి 28 వేల 350 ఎకరాల్లో ఈ–పంట నమోదు కార్యక్రమం పూర్తయిందని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు తెలిపారు. జిల్లాలో 1.7 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని, ఇప్పటికి 1.5 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారని ఆయన వివరించారు. నూతన విధానంలో ప్రవేశపెట్టిన యాప్ ద్వారా మండలంలోని ఊడిమూడి గ్రామంలో జరుగుతున్న ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం బోసుబాబు విలేకరులతో మాట్లాడారు. ఈ–పంట నమోదుపై గ్రామ సభల ద్వారా అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. వచ్చే నెలాఖరులోగా ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఏడీఏ జేఎస్‌వీ రామ్మోహన్‌రావు, ఏఓలు కల్యాణ్ సూర్యకుమార్, పవన్‌కుమార్, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.